క్లుప్తంగా

దుర్గాదేవి ఉత్సవాలకు పందిరిరాట



పందిరిరాట పూజలు చేస్తున్న యువత

మల్కాపురం: దుర్గాదేవి నవరాత్రుల సందడి మొదలైంది. ఉత్సవాల ఏర్పాటు చేసేందుకు పందిరిరాట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ 61వ వార్డు పల్లివీధి వద్ద అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద ముహూర్తపురాట వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే వారం నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్‌లో నివసిస్తున్న బి.మహంతి దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తన బావమరిది బైకుపై కంచరపాలెం నుంచి పూర్ణామార్కెట్‌కు వెళ్తున్న క్రమంలో జ్ఞానాపురం వద్దకు వచ్చేసరికి గాజువాక నుంచి అటుగా వస్తున్న ఏపీ08 ఎఫ్ 6126 నంబర్ గల కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. వెనక కూర్చున్న మహంతి ఒక్కసారిగా కింద పడిపోగా.. అతడి కుడి కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. మహంతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ సభ్యులు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యా రంగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఏబీవీపీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మెగా డీస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు, యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నినదించారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునకు ఏబీవీపీ సభ్యులు వినతిపత్రం అందజేశారు.

180వ రోజుకు రూ.10 భోజనం



పేషెంట్ సహాయకులకు భోజనం అందజేస్తున్న మక్బూద్ అహ్మద్

దాబాగార్డెన్స్: రౌండ్ టేబుల్, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రిలో రూ.10కే భోజనం అందజేత సోమవారం నాటికి 180వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భోజనంతోపాటు పోషకాలు కలిగిన హార్లిక్స్ పాలును పేషెంట్ సహాయకులకు అందించారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధి మక్బూద్ అహ్మద్, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సేవా మార్గాలా.. డంపింగ్ యార్డులా?



60వ వార్డు గుల్లలపాలెం మంచినీటి సరఫరా కార్యాలయం సమీపంలో పడేసిన చెత్త



61వ వార్డు వెంకన్నపాలెం సేవా మార్గంలో వ్యర్థాల వద్ద సంచరిస్తున్న పశువులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పలు సేవా మార్గాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. కొంత మంది స్థానికులు ఇంట్లోని వ్యర్థాలను దగ్గరలో ఉన్న సేవా మార్గాల్లో నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. దీంతో దుర్గంధం భరించలేక వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని మల్కాపురం మంచినీటి సరఫరా కార్యాలయానికి ముందు ఉన్న సేవా మార్గంలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా చెత్తను డంప్ చేస్తున్నారు. కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పశువులు, వీధి కుక్కలు, పందులు చేరి చిందరవందర చేస్తున్నాయి.

• 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద సేవా మార్గంలో కూడా చెత్త పేరుకుపోయింది. మల్కాపురం, పల్లివీధిలో వ్యర్థాలు కుప్పలుగా ఎక్కడకక్కడ దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలు తరలించే వాహనం రోజూ రెండు పూటలా రావాల్సి ఉంది. కానీ రోజుకు ఒక్కసారే వస్తుంది. సేవా మార్గాల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికలు అధికారులు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు. ఆయా వార్డుల శానిటరీ అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎస్ఎంఏ మెడికల్ సదుపాయం కల్పించాలి



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గోపాలపట్నం: ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న మెడికల్ సదుపాయాలు కొనసాగించాలని నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. నూతన మెడికల్ పాలసీకి వ్యతిరేకంగా సోమవారం ఎన్ఏడీ గేటు వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు సీఎస్(ఎంఏ) రైల్స్ ద్వారా మెడికల్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. దీని వల్ల ఉద్యోగితో పాటు కుటుంబ సభ్యులు కూడా ఈ సదుపాయం పొందుతున్నారని చెప్పారు. వాటికి ఆటంకం కలిగించే విధంగా కమాండ్ అధికారులు నూతన మెడికల్ పాలసీ అమల చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సీజీహెచ్ఎస్ ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బహుజనుల ఆశాజ్యోతి కాన్షీరాం



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

మల్కాపురం: బహుజనుల ఆశాజ్యోతి కాన్షీరాం అని బీఎస్పీ నాయకులు ధనుంజయరావు, రామచంద్రరావు అన్నారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ప్రకాష్ నగర్ అంబేడ్కర్ కళామందిర్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనులకు, బీఎస్పీ బలోపేతానికి కాన్షీరాం చేసిన త్యాగాలను వారు గుర్తు చేశారు.కార్యక్రమంలో బీఎస్పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఎస్.సాయి

కంచరపాలెం: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయి తెలిపారు. జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి తుమ్మడపాలెం చైతన్యం కల్చరల్ రూమ్‌లో సోమవారం సాయంత్రం నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణ సముదాయాలు, ఆటో స్టాండ్లు, అపార్ట్‌మెంట్లు, దేవాలయాలు, చర్చిలు, మసీదులకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కె.రాజు, సచివాలయం పోలీస్ శ్రీలక్ష్మి, కమిటీ ప్రెసిడెంట్ కోరిబిల్లి చంద్రశేఖర్, తిలక్, ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో నాయుడు



దాతలకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం అనకాపల్లికి చెందిన మళ్ల రామకోటేశ్వరరావు లక్షా 116 రూపాయిల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో నాయుడు అన్నప్రసాద బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.

• శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరానికి చెందిన బి.అశ్వని, సురేందర్‌రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళం ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

అప్రెంటిస్‌షిప్ మేళా విజయవంతం

499 మంది విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



మేళాకు హాజరైన విద్యార్థులు

పెదగంట్యాడ: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటిస్‌షిప్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాను ఆయన ప్రారంభించారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఎస్ఆర్ఎంటీ, హ్యుందాయ్ మోటార్స్, దేవి ఇంజినీరింగ్స్, ఎండీ ఎలక్ట్రికల్స్, లోహిత ట్రాన్స్‌ఫార్మర్స్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి.

ఈ మేళాకు మొత్తం 650 మంది విద్యార్థులు హాజరు కాగా 499 మంది విద్యార్థులను వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. మొత్తం 6 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో వి.సత్యనారాయణ, కుమారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

970వ రోజుకు ఉక్కు పరిరక్షణ ఉద్యమం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 970వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రప్రభుత్వం అమ్ముకుంటూపోతే దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు



దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలి.

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించడం తప్పనిసరని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతు లు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణకు హాజరైన ఎన్‌టీపీసీ అధికారులతో ఐఐఎం అధికారులు

ఏయూ క్యాంపస్: సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్‌టీపీసీ సింహాద్రి హెచ్‌వోపీ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో ఎన్‌టీపీసీ అధికారులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో పరిణితి సంస్థ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు వ్యక్తి ఉన్నతికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఐఐఎం విశాఖపట్నం ఇటువంటి కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ విభాగాధిపతి రుమా డి.శర్మ మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక కోర్సులు సంస్థలో పనిచేసే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఐఐఎం పరిపాలన విభాగం డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికి, సంస్థ ప్రగతికి దోహదపడే వ్యక్తులుగా తమ సిబ్బందిని మలచడానికి ఇటువంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య విశాల్ సింఘ్ పట్యాల్, తదిరతులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో నవంబరు 2, 3, 4 తేదీల్లో ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్య వింటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: వివిధ సమస్యలపై అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు జోన్-5 జెడ్సీ ఆర్జీవీ కృష్ణ సూచించారు. జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ కృష్ణ నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 03, యూసీడీ విభాగానికి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. స్పందనలో వచ్చిన వినతులు త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

బంధువులకు తిరుపతిరావు అప్పగింత



ఆశ్రమంలోని తండ్రిని తీసుకెళ్లేందుకు వచ్చిన కుమార్తె అనూష

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయుల షెల్టర్‌లో ఉన్న తిరుపతిరావును సోమవారం ఆయన బంధువులకు అప్పగించారు. మానసిక ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. ఆరోగ్యం కుదిటపడిన తరువాత డిశ్చార్జ్ చేసేందుకు వైద్యులు నిర్ణయించగా, తిరుపతిరావును తీసుకెళ్లేందుకు బంధువులు రాలేదు. దీంతో అతన్ని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆస్పత్రి నుంచి ఆశ్రమానికి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. అతని వివరాలపై ఆరా తీయగా, ఒంగోలు అని చెప్పాడు. ఈ మేరకు తిరుపతిరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని చిన్న కుమార్తె అనూష బుచ్చిరాజుపాలెంలోని షెల్టర్‌కు చేరుకొని, తండ్రిని ఇంటికి తీసుకెళ్లారు. ఇంత కాలం షెల్టర్‌లో ఆశ్రమం ఇచ్చినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటాపురం హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

గోపాలపట్నం: శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ స్పేస్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈ నెల 5 నుంచి పలు పోటీలు నిర్వహించారు. చిత్రలేఖన పోటీలో హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని గొలగాని హేమశ్రీ తృతీయ బహుమతి దక్కించుకుని సత్తా చాటింది. సుమారు ఏడు జిల్లాల నుంచి 2 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ మేరకు హేమశ్రీకి నిర్వాహకులు సర్టిఫికెట్, బహుమతి అందించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వి.జగదీష్‌ను, బహుమతి గెలుచుకున్న హేమశ్రీని పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్యంతో సాధన చేస్తే రాణింపు



కోచ్ నాగార్జునను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: నిర్దిష్ట లక్ష్యం ఏర్పరచుకుని తగిన సాధన చేస్తే క్రీడా రంగంలో రాణించవచ్చని ఆర్మీ ఇంటర్నేషనల్ అథ్లెటిక్ కోచ్ పల్ల నాగార్జున అన్నారు. సబ్బవరంలోని రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా ,రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజేతలగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. క్రీడల్లో రాణించడానికి ఎలా సాధన చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ, డైరెక్టర్ మీనాక్షిలక్ష్మి,పల్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ‘ఉక్కు’ మహిళల ప్రతిభ



షీల్డులు అందుకుంటున్న అంజలి, రోజాకుమారి, సంధ్యారాణి, సంధ్యాసాహు

ఉక్కునగరం: విశాఖ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉక్కునగరం మహిళలు యు.అంజలి, పి.రోజా కుమారి, పి.సంధ్యారాణి, సంధ్యా సాహు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లో ఆదివారం పలు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉక్కునగరానికి చెందిన యు.అంజలి 55+ కేటగిరీలో డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రథమ బహుమతులు గెలుపొందారు. 50+ కేటగిరీలో పి.రోజా కుమారి 5 కిలో మీటర్ల నడక పోటీలో, షాట్‌పుట్ పోటీల్లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. 50+ కేటగిరీ పోటీల్లో పి.సంధ్యారాణి 5 కిలోమీటర్ల నడక పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందారు. 40+ కేటగిరీ పోటీల్లో సంధ్యా సాహు డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరు నలుగురు డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటాద్రి తెలిపారు.

కేవీలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్



మాట్లాడుతున్న సీనియర్ డీపీవో రంజన్ మహంతి



క్యాంప్‌లో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం హైవేలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ కోసం తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌ను ముఖ్య అతిథి ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేటితరం పిల్లలు కేవలం విద్యకే పరిమితం కాకుండా విద్యేతర సంబంధిత ప్రత్యేక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. దీని ద్వారా వివిధ రంగాల్లో ప్రావీణ్యం సంపాదించవచ్చన్నారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. ఈ క్యాంప్‌లో 11 స్కూళ్ల నుంచి సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులు ఇంతవరకు నేర్చుకున్నవి పరీక్షించుకుంటూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం, నాట్స్, హిచెస్, ప్రథమ చికిత్స, క్రమశిక్షణ, షేరింగ్ అండ్ కేరింగ్, డూ టు ఏ గుడ్ టర్న్ వంటి విషయాలు నేర్చుకుంటారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని శైలజ, సిబ్బంది ప్రభాకర్, ఎం.రేఖ, వై.విజయలక్ష్మి, జగన్‌మోహన్, మణిబాబు తదితరులు సహకరిస్తున్నారు.